జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం




## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 21 | మే | 2026 ◆ పేజీలు : 6

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

- బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 20, (ప్రజాజ్యోతి)** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమన్వయ మిగతా 2 లో...



6 లో...


# డబ్బు కొట్టు.. పట్టా పట్టు?

సాధారణంగా వివాదాలకు సంబంధించి ఎలాంటి కేసులైన కోర్టు పరిధిలో ఉంటే ఆ కోర్టు తీర్పు వచ్చేంతవరకు ముందస్తు చర్యలు చేపట్టవద్దు. కానీ ఇల్లందు మండలంలోని ఓ సర్వే నెంబర్ లోని భూమి క్రయ విక్రయాలకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తున్నప్పటికి తహసీల్దార్ ఏకంగా పట్టా చేయడంతో ఇల్లందులో చర్చనీయాంశంగా మారింది.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

● ఇదేక్కడి న్యాయం అయ్యా! ● కోర్టులో ఉన్న భూమిని పట్టా చేసిన తహసీల్దార్! ● భూమి విక్రయాలు జరిగినట్టు ఆధారాలు ● తాము కొనుగోలు చేసి 10ఏళ్ళు దాటినప్పటికీ ఇన్నాళ్లు ఏమి చేశారని బాధితురాలి ప్రశ్న ● కొన్ని ఏళ్లుగా కోర్టులో నడుస్తున్న కేసు ● పరిష్కారం కాకుండా పట్టాలు ఇచ్చారు ● 2026 ఫిబ్రవరి లో ఏకపక్షంగా పట్టా చేసిన తహసీల్దార్? ● కలెక్టర్, ఆర్డిఓ స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితురాలి వేడుకోలు

## ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలి



- ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 20, (ప్రజాజ్యోతి)** ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి ఎక్కువ పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, మహిళా స్వయం సహాయక సంఘాలు, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్ఎఫ్ బీఎస్), చేయూత పథకం తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వేగవంతం కావడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త జాబ్ కార్డులు మంజూరు చేసి, ఉపాధి హామీ కూలీలు మిగతా 2 లో...

## పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**పాల్వంచ, మే 20, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అక్కడి అధికారులు మరియు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూరేలా మిగతా 2 లో...



## పాల్వంచలో అక్రమ మద్యం విక్రయాలపై మౌనం ఎందుకు..?

- స్పందించని అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు
- "పుష్ప" తరహాలో నడుస్తున్న మద్యం సిండికేట్ పై ప్రత్యేక దర్యాప్తు చేయాలంటూ ప్రజల డిమాండ్.

**పాల్వంచ, మే 20 (ప్రజాజ్యోతి):** పాల్వంచ పట్టణం, పరిసర గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు రోజురోజుకూ విస్తరిస్తుండటంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బెల్ట్ షాపుల పెరుగుదల, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు, మైనర్లకు సైతం మద్యం సులభంగా అందుబాటులో ఉండటం, అర్ధరాత్రి దాటినా కొనసాగుతున్న విక్రయాలపై ఇప్పటికే పలు కథనాలు వెలువడినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఇప్పుడు ప్రజల్లో కొత్త అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన "పుష్ప" తరహా మద్యం సిండికేట్ ఆరోపణలు పాల్వంచలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అధికారిక వైన్ షాపుల్లో లభ్యం కాని పలు బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో మిగతా 2 లో...

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం




(మొదటి పేజీ తరువాయి...)

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. బీఎల్ వోలు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమానికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. జూన్ 2026 నుండి బీఎల్ వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారైనా సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలు సేకరిస్తారని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 26 నుండి ప్రారంభమై 24-07-2026 లోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం 31-07-2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, 31-07-2026 నుండి 30-08-2026 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. 01-10-2026న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్-2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్ సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్‌లో "సెర్చ్ బై ఎలెక్టర్ డిటైల్స్" ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 01 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారికీ అవకాశం ఉంటుందని తెలిపారు. ఫారం నింపడంలో లేదా వివరాల ధృవీకరణలో సహాయం కోసం బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్, "బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో" సౌకర్యాలను వినియోగించుకోవచ్చని సూచించారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్న ఓటర్ల తరపున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, ఫారాల నింపే విధానంపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి రాంబాబు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి దేవి ప్రసన్న, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి కంచర్ల జమలయ్య, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



(మొదటి పేజీ తరువాయి...)

బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఎస్పీ, రోడ్డు ప్రమాదాలు మరియు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్రామాల వారీగా నిత్యం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్, ఎస్సైలు టి. నాగరాజు, జి. విజయతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచలో అక్రమ మద్యం విక్రయాలపై మౌనం ఎందుకు..?

(మొదటి పేజీ తరువాయి...)

విరివిగా దొరుకుతుండటంతో అక్రమ సరఫరా వెనుక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



### ››› ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం

అక్రమ మద్యం విక్రయాలపై ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎక్సైజ్ శాఖ గానీ, పోలీసు శాఖ గానీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్థానికులు నేరుగా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రయత్నించినప్పటికీ అధికారులు అందుబాటులో లేరని ఆరోపిస్తున్నారు. ఫోన్ ద్వారా సంప్రదించినా స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నీ అధికారులకు తెలిసే జరుగుతున్నాయా..? అనే ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో బహిరంగ చర్చకు దారితీసింది.

### ››› ఒకే నెట్‌వర్క్ ఆధీనంలో బెల్ట్ షాపులా..?

పాల్వంచ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని అనేక బెల్ట్ షాపులకు ఒకే కేంద్రం నుంచి మద్యం సరఫరా జరుగుతోందనే ప్రచారం జోరందుకుంది. ఏ గ్రామానికి వెళ్లినా ఒకే బ్రాండ్లు, ఒకే రేట్లు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొంతమంది బెల్ట్ షాపు నిర్వాహకులను ప్రశ్నించగా "ఇది సిండికేట్ సరుకు" అంటూ బహిరంగంగానే సమాధానం ఇస్తున్నారనే సమాచారం కలకలం రేపుతోంది. గ్రామాల వారీగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసి మద్యం సరఫరా జరుగుతోందన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

### ››› అధికారులకు తెలియకుండా ఇంత పెద్ద వ్యవస్థ సాధ్యమేనా..?

ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు బహిరంగంగానే నడుస్తున్నప్పటికీ, ఎక్సైజ్ శాఖ గానీ, పోలీసు శాఖ గానీ పెద్దగా దాడులు నిర్వహించకపోవడంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. రాత్రివేళల్లో కూడా విక్రయాలు కొనసాగుతున్నా తనిఖీలు లేకపోవడం, ఎంఆర్పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నా చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. "చిన్న వ్యాపారులపై వెంటనే కేసులు పెట్టే అధికారులు, ఇంత పెద్ద స్థాయిలో సాగుతున్న అక్రమ మద్యం వ్యాపారం మాత్రం కనిపించడంలేదా..?" అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.

### ››› యువత భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన

పాల్వంచ పరిసర గ్రామాల్లో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపుల్లో మైనర్లకు కూడా ఎలాంటి వయస్సు ధృవీకరణ లేకుండానే మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సులభంగా మద్యం పొందుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గల్లీల్లో, కిరాణా దుకాణాల వెనుక భాగాల్లో నడుస్తున్న బెల్ట్ షాపుల వద్ద యువకులు గుంపులుగా కనిపించడం సాధారణమైందని స్థానికులు చెబుతున్నారు. బహిరంగంగా మద్యం అందుబాటులో ఉండటంతో యువత వ్యసనాలకు బానిసవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### ››› రాత్రివేళల్లో పెరుగుతున్న గొడవలు

బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించిన వ్యక్తుల మధ్య తరచూ గొడవలు, దాడులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో గందరగోళ పరిస్థితులు నెలకొని మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో యువకులు గుంపులుగా చేరి మద్యం సేవించడం వల్ల స్థానికులు బయటకు రావడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం.

### ››› ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలంటూ ప్రజల డిమాండ్

పాల్వంచలో పెరుగుతున్న అక్రమ మద్యం వ్యవస్థపై ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని, అక్రమ సరఫరా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారిక వైన్ షాపుల స్టాక్ వివరాలు, సరఫరా రికార్డులు, బెల్ట్ షాపులకు చేరుతున్న మద్యం మార్గాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. "అధికారుల మౌనం అనుమానాలకు తావిస్తోంది... ఇప్పటికైనా స్పందించి పాల్వంచలో పెరుగుతున్న అక్రమ మద్యం మాఫియాను కట్టడి చేయాలి" అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

పూర్తి స్థాయిలో పని దినాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, చేయూత పథకాల లబ్ధి అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ) కార్డులను అందరికీ అందేలా ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు ఉదయం 5 గంటలకు పనిస్థలాలకు చేరుకొని విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మహిళా సంఘ భవనాలు తదితర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మండలాల్లో నమోదైన జాబ్‌కార్డు కార్మికుల హాజరు శాతం పెంచి కనీసం 40 రోజుల పాటు పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూన్ చివరి నాటికి మెటీరియల్ కాంపొనెంట్ క్రింద బుక్ చేయగల నిధులపై ఈఈలు పూర్తి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం



చేసి అమలు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. జల్ సంచయి జన్ భగీరథి పురస్కారాలను జిల్లా సాధించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. చేయూత పెన్షన్ లబ్ధిదారుల లైవ్‌నెస్ అథెంటికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించి నగదు పంపిణీపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. దివ్యాంగుల సదరం కేంద్రాల్లో సౌండ్ ప్రూఫ్ పరికరాలు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలులో అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో సుస్థిర ఆదాయం

ముల్కలపల్లి మే 20, ప్రజాజ్యోతి: రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయడంతో పాటు పంట మార్పిడి పాటిస్తే సుస్థిర ఆదాయం పొందవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సూరంపాలెం గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడకూడదని, వేపనూనె పిచికారీ, జిగురు అట్టల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తో పంట మార్పిడి చేపడితే నేల ఆరోగ్యంతో పాటు ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి ఫార్మర్స్ రిజిస్ట్రీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# రాజకీయ పార్టీలు బీఎల్‌ఏలను త్వరితగతిన నియమించాలి

- **భద్రాచలం నియోజక వర్గ సహాయ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట**



**భద్రాచలం టౌన్, మే 20, ప్రజాజ్యోతి** భద్రాచలం నియోజకవర్గంలో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(సర్) ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ ప్రజాప్రతినిధులు బిఎల్‌ఏలను త్వరితగతిన అపాయింట్ చేసి సంబంధిత బి ఎల్ వో లకు ఓటర్ సవరణ జాబిత ప్రక్రియ పూర్తి చేయడానికి సహకరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మరియు భద్రాచలం నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి మృణాల్ శ్రేష్ట అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం లోని సమావేశం మందిరంలో భద్రాచలం నియోజకవర్గంలోన 179 పోలింగ్ స్టేషన్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో ఓటర్ సవరణ, మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో ఈ నెల 15 నుంచి 22 వరకు ఎస్ఐఆర్ ఇంటింటి సర్వే ప్రారంభమైందని, 24 నుంచి బీఎల్‌వోలు, బి ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి పారాలను పంపిణీ చేయడానికి వెళుతున్నందున సంబంధిత రాజకీయ ప్రజా ప్రతినిధులు మీ తరపున ప్రత్యేకంగా బిఎల్ఎను అపాయింట్ చేసి సర్ మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణకు బి ఎల్ వో లకు సహకరించే విధంగా చూడాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు, బిఎల్‌వో, బి ఎల్ ఎ ల పేరు, మొబైల్ నెంబర్, పోలీస్ స్టేషన్ వివరాలు తెలిసేలా సంబంధిత రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని, బి ఎల్ ఓ, బిఎల్ఎలు ఇద్దరూ కలిసి నియోజకవర్గంలో ఉన్న ప్రముఖుల పేర్లు కూడా ఓటర్ జాబితాలో నమోదు చేయాలన్నారు. ఫారం-6,7,8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి మరణించిన ఓటర్ల వివరాలను ధ్రువీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని ఆయన అన్నారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి రికార్డులను తయారు చేయాలని అన్నారు. ఈ ప్రక్రియ జూన్ 24 నుండి జూలై 25 వరకు చేపట్టి బిఎల్వోలు ఇంటింటికి సర్వే నిర్వహించి ఎన్మరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరించి సమగ్ర ఓటర్ జాబితా పూర్తి అయ్యేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం తహసీల్దారు అశోక్ కుమార్, ఎలక్షన్ డిటి వినయశీల పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్ , మే 20 ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వారి కి అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచననం, కంకణదారణ, జీలకర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**భద్రాచలం టౌన్, మే 20, ప్రజాజ్యోతి** గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరల పెంపుకు హద్దు లేకుండా పోయిందని, దీంతో దేశంలో సగటు మనిషి నిత్యవసర సరుకులు కొనలేకపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి విమర్శించారు. పెరిగిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం పెట్రో ఉత్పత్తుల ధరలను వరుసగా పెంచుతుండటం పట్ల రూపాయి విలువ పోడిపోయి ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారని, నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఇరాన్‌తో యుద్ధం నేపధ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితులు దిగజారుతుండంతో ఆ ప్రభావం మనం డాలర్ల రూపంలో కొనుగోలు చేసే బంగారం, వెండి ధరలు పెరుగుతుండటంతో రూపాయి విలువ వందేళ్ల కనిష్టస్థాయికి పడిపోవడంతో కేంద్రం దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో విఫలమైందన్నారు. ప్రజలు ఇప్పటికైనా బిజెపి దొంగ నీతి అర్థం చేసుకోవాలని కోరారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడంతో హోటల్లో అల్పాహారాలు భోజనం ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి, 20వ వార్డు నెంబర్ అనసూయ, పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, ఉస్తేల జ్యోతి పాల్గొన్నారు.

## ఆన్లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలి

- **ఇల్లందులో మెడికల్ షాపుల బంద్ సంపూర్ణం**

**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి:** ఆన్లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలని, జీఎస్ఆర్ 817 నువ్వు సవరించాలని కోరుతూ ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు ఇల్లందు మెడికల్ షాపుల బంద్ సంపూర్ణం అయింది. బుధవారం మెడికల్ షాపుల బంద్ నేపథ్యంలో మెడికల్ షాప్ నిర్వాహకులు స్థానిక జగదాంబ సెంటర్ నుంచి ఆమ్ బజార్ మీదుగా పటేల్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఇల్లందు కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుమర్తి లక్ష్మణరావు మాట్లాడుతూ చిన్న మందుల షాపుల కోసం కార్పొరేట్లు ఇచ్చే భారీ డిస్కౌంట్లను అరికట్టాలని కోరారు. నకిలీ మందులను నివారించాలని, నాణ్యతలేని నకిలీ మందుల వ్యాప్తిని అందుకోవడానికి జిఎస్ఆర్ 220 ను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంధం వెంకటేశ్వర్లు, కోశాధికారి జహీర్ అహ్మద్, మెడికల్ షాప్ నిర్వాహకులు కొత్తూరు రామారావు, నాగేశ్వరరావు, సందీప్, గౌరీశెట్టి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడల్లో ప్రతిభ చాటిన పినపాక విద్యార్థిని

- **మినీ గురుకులం పినపాక విద్యార్థిని స్పోర్ట్స్ స్కూల్ హన్మకొండకు ఎంపిక**





**పినపాక, మే 20(ప్రజాజ్యోతి) :** పినపాక మండలం లోని స్థానిక మినీ గురుకులం బాలికలు పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని మర్మం వైష్ణవి, తండ్రి వెంకటేష్, విద్యార్థిని తన అసాధారణ ప్రతిభతో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. చిన్న వయస్సులోనే క్రీడలపై ఆసక్తి చూపుతూ వివిధ ఆటల పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆమెను అధికారులు నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణురాలిగా ప్రకటించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు ఆమెను వారి తల్లితండ్రులను శాలువాతో సత్కరించి అభినందించారు. పాఠశాలలో క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహం వల్లే విద్యార్థిని రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో అధికారులు శ్రీమతి బి. అరుణకుమారి, ఆర్.సీ.ఓ ఖమ్మం, ఏ.ఓ కే. నరేందర్ గురుకులం సెల్, ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎం. శకుంతల, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీ మహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది. విద్యార్థినిని, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 20 లీటర్ల నాటుసారాయి పట్టివేత



**భద్రాచలం టౌన్, మే 20 ప్రజాజ్యోతి** భద్రాచలం పట్టణంలో బుధవారం ఖమ్మం ఎన్‌ఫోర్సుమెంటు సీఐ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా 20 లీటర్ల నాటు సారాతో పట్టుకున్నారు. అలాగే పట్టుబడిన నలుగురుపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం భద్రాచలం ఎక్సైజు పోలీసులకు అప్పగించారు.

## ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా టీం తారక్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



**భద్రాచలం టౌన్, మే 20, ప్రజాజ్యోతి** భద్రాచలంలో చర్ల రోడ్డులోని కిరణ్ ఫ్లెక్స్ ప్రింటింగ్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన వేడుకలు టీం తారక్ భద్రాచలం అధ్యక్ష కార్యదర్శులు గరిమెళ్ళ సాయి కిరణ్, బాచినేని మణిదీప్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కటింగ్ నిర్వహించి, నిరుపేద 20 కుటుంబాలకు రూ.20 వేలు విలువ చేసే నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా కార్యదర్శి ఎస్.కె అజీమ్, టీం తారక్ గౌరవ సలహాదారులు విజ్జిగిరి రాజా కిరణ్ పాల్గొని మాట్లాడుతూ భద్రాద్రి రాముడు ఆశీస్సులు ఆ తారక రాముడికి ఎల్లప్పుడూ ఉంటాయని ఎన్టీఆర్ అడుగుజాడల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మా అభిమాన నాయకుడు ఎన్టీఆర్ తప్పకుండా సీఎం అవుతాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచినేని అనిల్, రజాక్, అడ్వకేట్ మోహన్ కృష్ణ, తీగల అరవింద్, హీరో షోరూం దుర్గ , ముక్కరభోయిన సత్య సాయి శ్రీనివాస్, రెడ్డిపాలెం కిరణ్, సిహెచ్ రాంబాబు టీం తారక్ అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమావేశంలో విజయ్ నాయుడు



**చర్ల, మే 20 (ప్రజా జ్యోతి):** భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ ఎన్నికల అవగాహన సమావేశంలో చర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అలాగే ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు అధికారులు పాటించాల్సిన నిబంధనలపై ఎన్నికల శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సమావేశంలో సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఎస్డీపీవోను కలిసిన బోరా పెద్దిరెడ్డి



**చర్ల , మే 20 (ప్రజా జ్యోతి):** ఇటీవల భద్రాచలం ఎస్డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్‌ను యువజన కాంగ్రెస్ డివిజన్ నాయకులు బోరా పెద్దిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యువతకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల్లో పోలీసు శాఖ సహకారం అందించాలని బోరా పెద్దిరెడ్డి కోరారు.డివిజన్ పరిధిలో యువతను మంచి మార్గాల్లో నడిపిస్తూ సామాజిక బాధ్యతల పట్ల చైతన్యం కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని డీఎస్పీ అరుణ్ కుమార్ సూచించారు. యువత సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ సూచించారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు బుధవారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పూర్తి నాణ్యత పాటించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులకు మరో నాలుగు దఫాలు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భోళ్ల సూర్యం, 20వ వార్డు కౌన్సిలర్ జాఫర్, నాయకులు వాజీద్, జేమ్స్ విక్కీ, యండి ఖాదర్, గోపి, నరేష్, ప్రజలు పాల్గొన్నారు.



# “కేసీఆర్ రావాలి.. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలి”

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది
- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి
- భద్రాచలంలో బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశంలో నేతల పిలుపు




**భద్రాచలం, మే 20, ప్రజా జ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కిందని, అందుకే రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి తక్కిళ్లపల్లి రవీందర్ అన్నారు.భద్రాచలంలో బుధవారం భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల సమన్వయ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పనిచేయాలని సూచించారు.డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తయ్యిన అనంతరం బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి బాటలు వేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ 2022 వరదల సమయంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను ఆదుకున్న తీరును భద్రాద్రి ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. భద్రాచలం కరకట్ట విస్తరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిందని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రజల్లో “కేసీఆర్ రావాలి – రేవంత్ పోవాలి” అనే భావన బలంగా పెరుగుతోందని పేర్కొన్నారు.రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతు సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని, అన్ని వర్గాల ప్రజలతో పాటు ముఖ్యంగా రైతులే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం సమిష్టిగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, గొడపర్తి నర్సింహమూర్తితో పాటు భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత్రికేయుడిని పరామర్శించిన ప్రెస్ క్లబ్ సభ్యులు



**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి:** గత కొన్ని రోజుల క్రితం ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయలై హైదరాబాద్ లో ఆపరేషన్ చేయించుకొని ఇంటికి వచ్చిన ఇల్లందు ఏబిఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ బొమ్మగాని రమేష్‌ను బుధవారం ఇల్లందు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాటేటి మధు, తాడురి శేఖర్, ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. ఏబిఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ బొమ్మగాని రమేష్ త్వరగా కోలుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు చాగర్ల సంతోష్, ఉపాధ్యక్షుడు కల్లేపల్లి రవి, సహాయ కార్యదర్శులు షేక్ చాంద్, గుగులోత్ రాజేష్, రఫీ, సభ్యుడు గంట మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో పాల్గొన్న ఇబ్రహీమ్



**ఇల్లందు, మే 20, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సు బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ ఇబ్రహీమ్ పాల్గొన్నారు. మూడో దశ ఎస్ఐఆర్ పై భారత ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిందని కలెక్టర్ తెలిపారని ఇబ్రహీమ్ పేర్కొన్నారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటికి బిఎల్ఓ, బిఎల్ఏ లు తిరుగుతూ ఓటర్ వివరాలు పరిశీలించనున్నారన్నారు. ఇంటి వద్దకు వచ్చే బిఎల్ఓ, బిఎల్ఏ లకు ఖచ్చితమైన ఓటర్ వివరాలు చెప్పాలని ఇబ్రహీమ్ కోరారు.

## ఎంపీడీవో ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం





**చర్ల, మే 20 :(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో డీఆర్డీవో ఆదేశాల మేరకు ఎంపీడీవో ఈదయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చర్ల తహసీల్దార్ శ్రీనివాస్ కూడా హాజరై వివిధ ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడం కోసం బల్క్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. చెత్త నిర్వహణలో గ్రామపంచాయతీలు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈజీఎస్ పనుల్లో కార్మికుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమావేశంలో సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై కూడా సమావేశంలో చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ ప్రత్యేక సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు , పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 20, (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న కొత్తగూడెం క్లబ్ లో నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రస్తుత ,రాబోయే సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత బలోపేతం చేయడం, జిల్లా అభివృద్ధి ప్రాధాన్యతలు, సమస్యలను గుర్తించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు . ఇప్పటి వరకు నిర్వహించిన థీమాటిక్ వారాల విజయాలను ప్రదర్శనల రూపంలో ప్రజలకు తెలియజేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న యువజన , క్రీడల థీమాటిక్ వీక్ (మే 18 నుంచి 23 వరకు) పై ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, యువజన సంఘాలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం, గృహజ్యోతి, సన్నరకం ధాన్యానికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాల అమలు వివరాలను ప్రజలకు వివరించాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా అల్పాహార పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు, పంటల వైవిధ్యీకరణ, సహజ సేంద్రియ వ్యవసాయం వంటి రాబోయే పథకాలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, లబ్ధిదారుల వివరాలు, నిధుల వినియోగ సమాచారం శాఖల వారీగా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల సందేశాలు, జిల్లా సమస్యలపై చర్చ, పరిష్కార సూచనలు, తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణ అంశాలు చర్చించనున్నట్లు తెలిపారు.

## నూతన ఎస్ఐ రాజేష్ కుమార్‌తో ఎమ్మెల్యే జారే భేటీ

- ప్రజల నమ్మకం పొందేలా పోలీసింగ్ ఉండాలి ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, మే 20 (ప్రజాజ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బి. రాజేష్ కుమార్ బుధవారం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా పోలీసింగ్ ఉండాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర ఎంతో కీలకమైందని, ప్రజల్లో భరోసా పెంపొందించేలా వ్యవహరించాలని కోరారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో సామాజిక ప్రశాంతత, చట్ట పరిరక్షణ కోసం పోలీస్ అధికారులు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నేరాల నియంత్రణతో పాటు యువతను మంచి మార్గంలో నడిపించే అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని తెలిపారు. నూతన ఎస్ఐ రాజేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు వ్యక్తులపై బైండవర్ కేసులు

**ములకలపల్లి, మే 20, ప్రజాజ్యోతి:** నలుగురు వ్యక్తులపై ములకలపల్లి పోలీసులు బుధవారం బైండవర్ కేసులు నమోదు చేశారు. స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేసి తహాశీల్దార్ ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్న ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై కోరారు.

## ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలు నిలిపివేయాలి

- మెడికల్ షాపుల బంద్ విజయవంతం



**ములకలపల్లి, మే 20, ప్రజాజ్యోతి:** ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోషియేషన్ పిలుపు మేరకు బుధవారం మండలంలోని కెమిస్టులు స్వచ్ఛందంగా మెడికల్ షాపులను బంద్ చేసి నిరసన తెలిపారు. ఆన్‌లైన్ ఔషధ విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ కెమిస్టులు మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్–19 సమయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన తాత్కాలిక జీఓను ఆధారంగా చేసుకుని కొన్ని కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్ల పేరుతో నకిలీ మందుల విక్రయాలకు పాల్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్ ఔషధ విక్రయాలను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్టులు పద్దం బుజ్జి, పుల్లూరి వేణు, బుగ్గా విశ్వాస్, కొమ్ము నాగరాజు, షేక్ రఫీ, చెన్నారావు, మహేష్, అందే రమేష్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

- అన్నదానంతో అభిమానుల సేవా కార్యక్రమం





**దమ్మపేట, మే 20 (ప్రజాజ్యోతి):** ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను దమ్మపేట మండల కేంద్రంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానులు పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ, తమ అభిమాన హీరో జూనియర్ ఎన్టీఆర్ మరెన్నో విజయాలు సాధించి, భవిష్యత్తులో ప్రజా సేవలో కూడా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఎండి వలీపాషా, సా యిల నర్సి, షేక్ గోరె, ఉయ్యాల లక్ష్మీనారాయణ, సయ్యద్ మౌలానా, పానుగంటి భార్గవ్, పిట్టల లాలూ, వేణు, ఉలవల సాయి, సతీష్, రాజు తదితర అభిమానులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో కాన్పు: తల్లి, బిడ్డ క్షేమం



**ఆళ్ళపల్లి. మే20. ప్రజాజ్యోతి** ఆళ్లపల్లి మండలం సింగారం గ్రామానికి చెందిన గర్భిణి మడకం భీమికి ప్రసవ వేదనలు ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. ఈ ఎంటి భాగ్యమ్మ, పైలట్ సునీల్ కు మార్ వెంటనే అక్కడికి చేరుకుని ఆ మెను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే నొప్పులు తీవ్రమ య్యాయి. సమయస్ఫూర్తితో వ్యవహరించిన 108 సిబ్బంది అంబులెన్స్ లోనే ఆమెకు సురక్షితంగా ప్రసవం చేశారు. భీమి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని, వారిని ఆళ్లపల్లి ఆసుపత్రికి తరలించామని సిబ్బంది తెలిపారు. అత్యవసర సమయంలో చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేసిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- కొత్వాల శ్రీనివాసరావు




**పాల్వంచ, మే 20, ప్రజాజ్యోతి:** ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్వాల శ్రీనివాసరావు కోరారు. పాల్వంచ మండలం పరిధిలోని సోములగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సొసైటీ పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం, తూర్పార పట్టే విధానం, రైతులు తూకం వేయిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు మిల్లర్లతో సమన్వయం చేసుకుని రైతుల ధాన్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లుల్లో దించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్ భూక్యా కిషన్, సొసైటీ సీఈఓ ఏ. లక్ష్మీనారాయణ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## దమ్మపేట ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్ కుమార్

**దమ్మపేట, మే 20(ప్రజా జ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా బి. రాజేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన ఆయనను ఉన్నతాధికారులు దమ్మపేటకు బదిలీ చేసినట్లు తెలిసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడం, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండల పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పోలీసు సిబ్బంది రాజేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఆయన, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని సూచించారు.






# డబ్బు కొట్టు.. పట్టా పట్టు?

- ఇదేక్కడి న్యాయం అయ్యా! • కోర్టులో ఉన్న భూమిని పట్టా చేసిన తహసీల్దార్! • భూమి విక్రయాలు జరిగినట్టు ఆధారాలు • తాము కొనుగోలు చేసి 10ఏళ్ళు దాటినప్పటికీ ఇన్నాళ్లు ఏమి చేశారని బాధితురాలి ప్రశ్న • కొన్ని ఏళ్లుగా కోర్టులో నడుస్తున్న కేసు • పరిష్కారం కాకుండా పట్టాలు ఇచ్చారు • 2026 ఫిబ్రవరి లో ఏకపక్షంగా పట్టా చేసిన తహసీల్దార్? • కలెక్టర్, ఆర్డీఓ స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితురాలి వేడుకోలు

**సాధారణంగా వివాదాలకు సంబందించి ఎలాంటి కేసులైన కోర్టు పరిధిలో ఉంటే ఆ కోర్టు తీర్పు వచ్చేంతవరకు ముందస్తు చర్యలు చేపట్టవద్దు. కానీ ఇల్లందు మండలంలోని ఓ సర్వే నెంబర్ లోని భూమి క్రయ విక్రయాలకు సంబందించి కోర్టులో కేసు నడుస్తున్నప్పటికి తహసీల్దార్ ఏకంగా పట్టా చేయడంతో ఇల్లందులో చర్చనీయాంశంగా మారింది.**

**• ఇల్లందు, ప్రజాజ్యోతి**

ఇల్లందు మండలంలోని సుదిమళ్ళ గ్రామంలో 339 సర్వే నెంబర్ లో 5.03 ఎకరాల భూమి విషయంలో ఇరువర్గాలు భద్రాచలం మొబైల్ కోర్టును ఆశ్రయించడం జరిగింది. కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ తహసీల్దార్ చట్టాలకు తూట్లు పొడుస్తూ పట్టాలు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ భూమి క్రయవిక్రయాల్లో ఈ వ్యవహారంలో రూ.లక్షల రూపాయలు చేతులు మారినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. సుదిమళ్ళ గ్రామంలోని 339 సర్వే నెంబర్ లో 5.03 ఎకరాల భూమిని ఓ మహిళా 2016లో కొనుగోలు చేసినట్టు సమాచారం. కానీ అట్టి భూమి కొనుగోలు, విక్రయదారుల మధ్య తలెత్తిన సమస్యతో ఇరు వర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఇట్టి కేసు నేటికీ కోర్టులో కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. విక్రయించిన తిరిగి కొనుగోలుదారులకు తెలియకుండా అక్రమ మార్గంలో 2026 ఫిబ్రవరి నెలలో పట్టా పొందడంతో కొనుగోలుదారులబోదిబో మంటూ రెవెన్యూ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పట్టా చేసే సమయంలో కాస్తుదారులుగా ఎవరున్నారనేది తెలియకుండా రూ. లక్షలకు అమ్ముడుపోయి పట్టాలు చేసినట్లు ఆరోపిస్తున్నారు.

### ››› అప్పుడు లక్షల్లో... ఇప్పుడు కోట్లల్లో భూమి ధరలు?

సుదిమళ్ళ గ్రామంలోని 339 సర్వే నెంబర్ భూమిని 2016 లో రూ. లక్షలకు విక్రయాలు చేయడం జరిగింది. అప్పుడు ఉన్న రేటు ప్రకారంగా విక్రయించిన భూమి రూ. లక్షల్లో పలికింది. కను నేడు అదే భూమి రూ. కోట్లకు పడగలేత్తడంతో తిరిగి విక్రయించిన వారే డబ్బు ఆశతో కొనుగోలు చేసిన వారికి తెలియకుండానే రెవెన్యూ అండదండలతో కోర్టు పరిధి లోని భూమిని పట్టా చేసుకొని కాజేశారు. ఈ తంతు వెనకాల కొందరు రాజకీయ పార్టీ నేతలు, తహసిల్దార్ బినామీలు, రెవెన్యూ అధికారి భారీ గానే ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### ››› పట్టా కోసం రూ. లక్షలు

### చేతులు మారాయా?

కోర్టు పరిధిలో ఉన్న వివాద భూమి విషయంలో కొందరి మధ్యవర్తుల ద్వారా రూ. లక్షలు చేతులు మారిన తర్వాతనే 2026 ఫిబ్రవరి నెలలో పట్టా చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అసలు కోర్టు పరిధిలో ఉండి ఎలాంటి తీర్పు రాకుండా పట్టా ఎలా చేశారని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. పట్టా చేయించడానికి మధ్యవర్తిత్వం వహించిన వారెవ్వరూ... ఎంత రూ. లక్షలు చేతులు మారినాయో స్పష్టత రావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఉన్నతాదికారులు స్పందించాలని వేడుకోలు

సుదిమళ్ళ గ్రామంలోని 339 సర్వే నెంబర్ 5.03 ఎకరాల భూమిపై క్రయ విక్రయాలు జరిగిన వారు ఇరువురి భద్రాచలం మొబైల్ కోర్టులో కేసు నమోదు చేయడం జరిగింది. కోర్టు పరిధిలో ఉన్న భూ వ్యవహారం కొలిక్కి రాకముందే ఇష్టానుసారంగా 2026 ఫిబ్రవరి నెలలో పట్టా చేసిన రెవెన్యూ అధికారిపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి ఏకపక్షంగా వ్యవహరించిన సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు వేడుకుంటుంది. ఇదిలా ఉంటే రెవెన్యూ పరిధిలో అనేక భూ సమస్యలను తన ఆసరాగా చేసుకొని వందల ఎకరాలను మార్పులు చేసినట్లు, ఇందులో భాగంగా రూ. కోట్లు కొల్లగొట్టినట్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే కొంతమంది గుసగుసలాడుకుంటూ ఉండడం చర్చనీయాంశంగా మారింది...

# పాల్వంచ లో ప్రజాధనం రోడ్డు పాలు

- డివైడర్ మొక్కల పేరిట లక్షల ప్రజాధనం వృథా..
- నాటిన కొద్ది రోజులకే ఎండిపోయిన మొక్కలు
- లక్ష్మీదేవిపల్లి నుండి జగన్నాధపురం మార్గంలో అధికారుల పనితీరుపై విమర్శలు
- ప్రజాధనంతో చేపట్టిన పనుల్లో పారదర్శకత కోరుతున్న స్థానికులు

**పాల్వంచ, మే 20, ప్రజాజ్యోతి :** ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం చేకూర్చాల్సింది పోయి, కేవలం ప్రదర్శనకే పరిమితమవుతున్నాయా..? అంటూ పలువురు ప్రశ్నిస్తునారు. లక్ష్మీదేవిపల్లి నుంచి జగన్నాధపురం వరకు రహదారి డివైడర్ పై ఇటీవల నాటిన మొక్కల పరిస్థితిని పరిశీలిస్తే ఇదే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది. భారీ ఎండల మధ్య సరైన ప్రణాళిక, ముందస్తు జాగ్రత్తలు లేకుండా మొక్కలు నాటడంతో అవి కొద్ది రోజులకే ఎండిపోవడం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. లక్షల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన ఈ కార్యక్రమం చివరకు వృథాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ››› హడావుడిగా మొక్కలు నాటించారని ఆరోపిస్తున్న ప్రజలు

స్థానికుల కథనం ప్రకారం, శ్రీరామనవమి ఉత్సవాల ముందు రహదారి అందంగా కనిపించాలనే ఉద్దేశంతో అధికారులు హడావుడిగా మొక్కలు నాటించినట్లు తెలుస్తోంది. అయితే మండుతున్న ఎండలు, నీటి కొరత, తగిన సంరక్షణ చర్యల లేమి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన ఈ కార్యక్రమం ఫలితంగా ఎక్కువ శాతం మొక్కలు నాటిన కొద్ది రోజులకే ఎండిపోయాయి. ప్రస్తుతం డివైడర్ పై పచ్చదనం కనిపించాల్సిన చోట ఎండిపోయిన మొక్కలే దర్శనమివ్వడం పట్ల ప్రజలను తీవ్ర ఆగ్రహం వ్యక్త



మౌతుంది.

### ››› రక్షించే బాధ్యత ఎవరిది

సాధారణంగా వర్షాకాలంలో చేపట్టాల్సిన మొక్కల పెంపక కార్యక్రమాన్ని తీవ్ర ఎండాకాలంలో నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "మొక్కలు నాటడం ఒక్కటే కాదు... వాటిని బ్రతికించడం కూడా అధికారుల బాధ్యతే" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటికి తగిన స్థాయిలో నీరు అందించకపోవడం, క్రమం తప్పకుండా పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు.

### ››› ఒక్కో మొక్కకు రూ.150 నుంచి రూ.200 వరకు ఖర్చు

స్థానికుల సమాచారం ప్రకారం, డివైడర్ పై నాటిన ఒక్కో మొక్కకు రూ.150 నుంచి రూ.200 వరకు ఖర్చు చూపించినట్లు తెలుస్తోంది. అయితే మార్కెట్ లో ఆ మొక్కల అసలు ధర అంత ఉందా..? లేక లెక్కల్లో మాత్రమే వ్యయం పెంచి చూపించారా..? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మొక్కల కొనుగోలు, రవాణా, నాటడం, సంరక్షణ పేర్లతో భారీ మొత్తాలు చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాధనంతో చేపట్టిన పనుల్లో పూర్తి పారదర్శకత ఉండాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ››› సంరక్షణ లేకనే ఎండిపోయిన మొక్కలు

ఇక మొక్కలకు నిరంతరం నీళ్లు పోస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో మొక్కల వద్ద తేమ కూడా కనిపించకపోవడం గమనార్హం. సరైన సమయంలో తగిన మోతాదులో నీరు అందించి ఉంటే మొక్కలు ఇంత వేగంగా ఎండిపోయేవి కావని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కొందరు స్థానికులు స్వయంగా మొక్కలకు నీళ్లు పోయడానికి ప్రయత్నించిన సందర్భాలూ ఉన్నాయని సమాచారం. "ప్రజల డబ్బుతో మొక్కలు నాటి, తర్వాత వాటిని పట్టించుకోకపోవడం బాధాకరం" అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› మొక్కలు నాటడం ఇదేం మొదటి సారి కాదు అంటున్న ప్రజలు

గతంలో కూడా ఇదే డివైడర్ పై పలుమార్లు మొక్కలు నాటిన ఘటనలు జరిగాయని, అయితే వాటి పరిస్థితి ఏమైందో ఇప్పటికీ స్పష్టత లేదని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రతి సంవత్సరం మొక్కలు నాటడం, కొన్ని రోజుల్లో అవి ఎండిపోవడం ఒక ఆనవాయితీగా మారిందని విమర్శిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో చేపడుతున్న కార్యక్రమాలు కేవలం ఫోటోలు, ప్రచారానికే పరిమితమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› మాకు ఏం సంబంధం లేదు

మరోవైపు కొందరు గ్రామ సర్పంచులు కూడా ఈ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. శ్రీరామనవమి ఉత్సవాల ముందు డివైడర్ పై నాటిన మొక్కల గురించి "మాకు సమాచారం ఇవ్వకుండా, మా అభిప్రాయం తీసుకోకుండా అధికారులు మొక్కలు నాటించారు" అని కొందరు వ్యాఖ్యానించినట్లు సమాచారం. దీనితో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లోపించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు కేవలం చూపుడుబొమ్మలుగా..

లక్ష్మీదేవిపల్లి నుంచి బసవతారక కాలనీ, కేశవాపురం, పెద్దమ్మగుడి, జగన్నాధపురం వరకు ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. రహదారి అందంగా కనిపించాలనే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమం చివరకు విమర్శలకు దారితీసింది. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు కేవలం చూపుడుబొమ్మలుగా కాకుండా, దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

### ››› అధికారులు వెంటనే స్పందించాలి

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, మొక్కల కొనుగోలు నుంచి సంరక్షణ వరకు జరిగిన ఖర్చులపై సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం వృథా అయి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రజలు సూచిస్తున్నారు.